

విద్యా కమిషన్‌కు సమస్యల ఏకరువు
రాష్ట్ర విద్యాకమిషన్‌కు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, టీచింగ్, నాటీచింగ్ స్టాఫ్ సమస్యలు ఏకరువు పెట్టారు. -8లో▸



వారసత్వ హోదాకు నాలుగేళ్లు.. -8లో▸
రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చి నాలుగేళ్లయినా అభివృద్ధి మాత్రం జరగడం లేదు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
27.3^0 / 24.4^0
జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- 24గంటలు సేవలు.. సిబ్బంది కేటాయింపు



ఏటూరునాగారం: ఐటీడీఏ కార్యాలయంలో ఫ్లడ్ కంట్రోల్ రూమ్(విపత్తు) సహాయక కేంద్రాన్ని గురువారం పీఓ చిత్రామిశ్రా ఏర్పాటు చేశారు. గోదావరి, వాగుల వల్ల ఆపదలో ఉన్న బాధితులు 08717 293246 నంబర్లకు సమాచారం అందించాలి. సహాయక చర్యలు అందించడానికి ఈ నెల 31వ తేదీ వరకు రవీందర్ 9490773342, పాపారావు 8008932159, రమేష్ 9491924792, భిక్షపతి 9490341911, కిరణ్ కుమార్ 8977669154, విష్ణు 8500600522 అందుబాటులో ఉంటారు. అలాగే వచ్చే నెల నుంచి 10 వరకు మల్లేశం 7330828552, నారాయణ 9492445723, హేమంత్ 9989471104, షకిల్ 9494808005, నా రాయణ8309945414లు అందుబాటులో ఉంటూ ఆపదలో ఉన్న వారికి సేవలు అందించనున్నారు.

పాలెం ప్రాజెక్టు ప్రధాన కాల్వకు బుంగ



వెంకటాపురం(కె): పాలెం ప్రాజెక్టు ప్రధాన కాల్వకు బుంగ పడింది. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైతుల కథనం ప్రకారం..ప్రాజెక్టు ప్రధాన కాల్వకు బొల్లారం గ్రామ సమీపంలో బుంగ పడి పంట పొలాల్లోకి కాల్వ నీరు పంట పోలాల్లోకి ప్రవహిస్తోంది. బుంగ నుంచి నీటి ఉధృతి ఎక్కువ అవుతుండడంతో గ్రామ రైతులు సొంత ఖర్చులతో జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌లో మొరం తెప్పించుకుని బస్తాల్లో మూట కట్టి బుంగను పూడ్చుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బుంగ పడ్డ ప్రాంతంలో కాల్వకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ప్రాజెక్టులకు జలకళ

ఎడతెరిపి లేని వర్షంతో నిండు కుండల్లా చెరువులు, కుంటలు
- అన్నదాతల్లో హర్షం
- నీరు వృథాగా పోకుండా అధికారులు పర్యవేక్షించాలని విజ్ఞప్తి



భారీగా వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకున్న మల్లూరువాగు ప్రాజెక్టు

మంగపేట: జిల్లాలోని ప్రాజెక్టులు జలకళతో ఉట్టిపడుతున్నాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో నిండుకుండలా మారాయి. పలుచోట్ల చెరువులు మత్తళ్లు పోస్తుండడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. తొలుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు వర్షాలు ముఖం చాటేయడంతో ఆందోళన చెందిన రైతన్నలు మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు దంచికొట్టిన వానకు నీరు లేని పంట పొలాల్లో వరదలు పారాయి. చెరువులు, కుంటలతో పాటు ప్రధాన ప్రాజెక్టుల్లోనిమత్తడి పోస్తుండటంతో అన్నదాతలు వరినాట్లు వేయిస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

ప్రధాన జలాశయాల్లోకి భారీగా చేరిన నీరు

జిల్లాలో ప్రధాన జలాశయాలు అయిన నూగూరు వెంకటాపురం మండలంలోని పాలెంవాగు ప్రాజెక్టు, మంగపేటలోని మల్లూరువాగు మధ్యతరహా ప్రాజెక్టు, గోవిందరావుపేట లోని లక్నవరం, వెంకటాపురం(ఎం) మండలంలోని రామప్ప వంటి జలాశయాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆయా ప్రాజెక్టులు, చెరువుల ఆయకట్టు భూములకు రెండు పంటలకు సరిపడా నీరు వచ్చి చేరడంతో అన్నదాతల్లో ఆనందం నెలకొంది.

లక్నవరం జలాశయంలోకి 24 అడుగులు

గోవిందరావుపేట: మండలంలోని లక్నవరం సరస్సులోకి వరద నీరు పోటెత్తింది. 34 అడుగుల సామర్థ్యం కలిగిన సరస్సుకు ఎగువ నుంచి భారీగా వరద పోటెత్తడంతో 24 గంటల వ్యవధిలోనే నాలుగు అడుగులు చేరి 24 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. తిరిగి ఇంక వరద పోటెత్తుతుండగా మరో రెండు అడుగులకు నీరు చేరే అవకాశం ఉంది.

నాలుగు గేట్లు ఎత్తి.. దిగువకు నీరు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపంలో నిర్మించిన పాలెం వాగు ప్రాజెక్టు జలకళ సంతరిచుకుంది. పాలెం ప్రాజెక్టు సామర్థ్యానికి మించి వరద నీరు చేరటంతో ప్రాజెక్టు నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.



గేట్లు ఎత్తివేయడంతో దిగువకు వెళ్తున్న నీరు



24 అడుగుల్లో లక్నవరం జలాశయం

జలాశయాల్లో నీటిమట్టం వివరాలు

ప్రాజెక్టు	మొత్తం నీటిమట్టం	ప్రస్తుతం	ఆయకట్టు ఎకరాలు
మల్లూరువాగు ప్రాజెక్టు	27 ఫీట్లు	21.3 ఫీట్లు	7,500
పాలెం ప్రాజెక్టు	136 మీటర్లు	132 మీటర్లు	10,125
లక్నవరం	33 ఫీట్లు	24 ఫీట్లు	8,794
రామప్ప	35 ఫీట్లు	22 ఫీట్లు	5,180

అధికారులు పర్యవేక్షించాలి..



రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు నిండి మత్తడి పోయడం సంతోషంగా ఉంది. చెరువుల శిఖం భూములను కబ్జా చేసి పంటలను సాగు చేస్తున్న కొందరు ఇప్పటికే నాట్లు వేయగా మరి కొందరు సాగు చేసేందుకు సిద్ధం చేసిన భూములు నీట మునిగి ఉన్నాయి. దీంతో ప్రతిఏటా కబ్జాదారులు చెరువుల షట్టర్లను ధ్వంసం చేసి చెరువుల్లోని నీటిని బయటకు వెల్లగొడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు చెరువులు. కుంటలు, ప్రాజెక్టులలో నీరు వృదాగా పోకుండా ఆయకట్టు రైతులకు ఉపయోగ పడే విదంగా పర్య వేక్షించాలి.

– నూతులకంటి కృష్ణ, బోరునర్సాపురం, రైతు

నీరు వృథా కాకుండా చర్యలు



ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి చేరిన నీటిని ఆయకట్టు రైంతాంగానికి పూర్తి స్థాయిలో సాగు నీరు అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిత్యం ప్రాజెక్టులు, చెరువులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. ఎప్పటికప్పుడు అవసరమైన మేరకు నీరు వృథాగా పోకుండా ఉండేందుకు మరమ్మతులు చేస్తున్నాం. తమ అనుమతి లేకుండా ఎవరైనా తూముల షట్టర్లు తెరిచినా, ధ్వంసం చేసినా వారిపై కేసులు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– వలీం మహ్మద్, ఇరిగేషన్ ఏఈఈ, మంగపేట

వాజేడు: అలుగు పోస్తున్న గుండ్లవాగు ప్రాజెక్టు



అలుగుపోస్తున్న గుండ్లవాగు

వాజేడు: మండల పరిధిలోని కొప్పుసూరు గుట్టల వద్ద ఉన్న గుండ్లవాగు ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. వాజేడు మండలంలో కురుస్తున్న వర్షాలకు తోడు గుట్టలపై నుంచి నీరు వస్తుండటంతో ప్రాజెక్టు సామర్థ్యం మేరకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం కంటే ఎక్కువగా వస్తున్న నీరు అలుగు పైనుంచి గుండ్ల వాగులోకి జాలు వారుతోంది. అలుగుపై నుంచి పడుతున్న నీరు చూపరులను కట్టిపడేస్తోంది.

వరదలతో అప్రమత్తం

- కలెక్టర్ టీఎస్.దివాకర
- కొండాయిలో జంపన్నవాగు ఉధృతి పరిశీలన
- టోల్‌ఫ్రీ నంబర్ 18004257109



కొండాయిలో జంపన్నవాగు వరద ఉధృతిపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం: జిల్లాలోని వాగులు, గోదావరి వరద ఉధృతి రోజురోజుకూ పెరుగుతుందని ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దివాకర సూచించారు. మండల పరిధిలోని దొడ్ల, కొండాయి బ్రిడ్జి వద్ద జంపన్నవాగు వరద ఉధృతిని కలెక్టర్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు రోజులు కురిసిన వర్షానికి జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో వాగుపై గతంలో నిర్మించిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయిందని తెలిపారు. కొండాయి గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు, వైద్యాధికారులను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. అత్యవసర పనుల కోసం బోటు అందుబాటులో ఉందని, అదనంగా రెండు బోటులు గురువారం సాయంత్రానికి వస్తాయన్నారు. దీంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో రెండు బోట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదే విధంగా ఎన్‌డీఆర్ఎఫ్ టీంతో పాటు నాలుగు బోట్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. అదే విధంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు భయపడకుండా తగు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి బోట్లతో పాటు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

మండలాల్లోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులతో పాటు మిగతా అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించే ప్రాంతాల్లోనే ఉండాలన్నారు. సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రూంలో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి నాగరాజు, తహసీల్దార్ జగదీశ్వర్, ఆర్ఐ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎరువుల విక్రయ కేంద్రం తనిఖీ

ఏటూరునాగారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నడుపుతున్న ఎరువుల విక్రయ కేంద్రంలోని రికార్డులు తప్పకుండా ఉండాలని కలెక్టర్ దివాకర ఆదేశించారు. మండల పరిధిలోని చిన్నబోయినపల్లి పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిల్లు, విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లు బుక్కులను పరిశీలించారు. అనంతరం గోదాములో నిల్వ చేసి ఉన్న విత్తనాలు, ఎరువులు, మందులను పరిశీలించారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

గోవిందరావుపేట: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని కలెక్టర్ దివాకర అన్నారు. మండల పరిధిలోని పస్రాలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను గురువారం కలెక్టర్ సందర్శించారు. టీచర్ల వివరాలతో పాటు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం క్లాస్ రూంలకు వెళ్లి విద్యార్థులతో పలు అంశాలు పైన మాట్లాడారు. అందరికి యూనిఫామ్స్, నోట్ బుక్స్ వచ్చాయా అంటూ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు
- ఎస్పీ శబరీశ్



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ శబరీశ్

వెంకటాపురం(ఎం): గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ శబరీశ్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలతో పాటు రిసెప్షన్ సెంటర్ పనితీరును పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదు దారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ అనంతరం కేసు నమోదు చేయాలని ఆదేశించారు. 5 ఎస్ విధానం అమలుపై తెలుసుకున్నారు. ప్రతీ వర్టికల్‌కు ఒక అధికారిని నియమించి ఎప్పటికప్పుడు రికార్డు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. అనంతరం విచారణలో ఉన్న కేసులను, కంప్యూటర్ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మిస్సింగ్ కేసుల విచారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పని పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ములుగు సీఐ సురేష్, ములుగు ఎస్‌హెచ్‌ఓ రాజు తదితరులు ఉన్నారు.

రామదాసు స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

గోవిందరావుపేట: రామదాసు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో వీరపనేని రామదాసు వెంకటసుబ్బమ్మల 5వ వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పార్టీ సీనియర్ నాయకుడు గుండు సత్యనారాయణ జెండా ఆవిష్కరించి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని కమ్మ సంఘం ఫంక్షన్‌హాల్‌లో సోమా మల్లారెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రామదాసు స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి జైలు జీవితం గడిపాడని తెలిపారు. కృష్ణా జిల్లాలో గన్నవరం తాలుకాలో కమ్యూనిస్టు పార్టీలో సుందరయ్యతో కలిసి పని చేశాడని తెలిపారు. అక్కడి నుంచి గోవిందరావుపేట కు వచ్చిన తర్వాత కూడా ఉద్యమాలను బలోపేతం చేశారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో సీపీఎం జిల్లాలో నాలుగు జెడ్పీటీసీలు 30ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి సాంబశివ పాల్గొన్నారు.

బొగతలో మరమ్మతులు



బొగత వద్ద రెయిలింగ్ పనులు చేస్తున్న సిబ్బంది

వాజేడు: చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతం వద్ద గురువారం మరమ్మతు పనులను చేపట్టారు. మంగళ, బుధవారాల్లో కురిసిన భారీ వర్షానికి జలపాతం సమీపంలో ఉన్న రెయిలింగ్, భద్రత కోసం ఏర్పాటు చేసిన కంచె కొట్టుకు పోయాయి. దీంతో గురువారం రేంజర్ చంద్రమౌళి, ఫారెస్టర్ భిక్షపతి, ఎఫ్‌బీవో ప్రసాద్ ఆధ్వర్యంలో బొగత సిబ్బంది రెయిలింగ్ మరమ్మతు పనులను చేపట్టారు.

చేపల వేటకు వెళ్లొద్దు



జిల్లా మత్స్యశాఖ అధికారి సల్మాన్‌రాజ్

ములుగు రూరల్: భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని జిల్లా మత్స్యశాఖ అధికారి సల్మాన్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై, ఆగస్టు మాసాలలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. చేపలు రెండు నెలల సమయంలో గుడ్లు పెట్టే దశ అని తెలిపారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని తెలిపారు. చెరువులు, కుంటలకు మత్తడి ప్రాంతాలలో జాలీలు, కర్రలను ఏర్పాటు చేయడం వల్ల తెగిపోయే ప్రమాదం ఉంటుందని సూచించారు.

సంక్షేమ బాట

నేటినుంచి ప్రజల వద్దకు ప్రజాప్రతినిధులు, అధికారులు

- మండల కేంద్రాల్లో సభలు, రేషన్ కార్డుల పంపిణీతోపాటు పథకాల అమలుపై సమీక్ష
- ఆగస్టు 10 వరకు వరుసగా కార్యక్రమాలు.. సర్వసన్నద్ధమైన యంత్రాంగం
- ఆశల పల్లకీలో అందరూ.. 'రేషన్'జాబితాలో ఎందరో..
- సదస్సుల నిర్వహణ తీరుపై ఇంటెలిజెన్స్ నిఘా?

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం నేటినుంచి రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. మరో మూడు పథకాల అమలును క్షేత్రస్థాయిలో సమీక్షించనుంది. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు, అధికారులు శుక్రవారంనుంచి మండలాల వారీగా ఏర్పాటుచేసే సభల్లో పాల్గొననున్నారు. ఈ నెల 21న మంత్రులతో కలిసి జిల్లా కలెక్టర్‌లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల వద్దకు వెళ్లే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజు జిల్లా కలెక్టర్, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలకు ప్రభుత్వంనుంచి కార్యక్రమాల షెడ్యూల్ కూడా అందింది. ఉమ్మడి వరంగల్‌లో శుక్రవారం నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కలెక్టర్‌లు కార్యాచరణ సిద్ధం చేశారు.

'రేషన్'పంపిణీకి ప్రాధాన్యం


మండల కేంద్రాల్లో జరిగే సదస్సుల్లో అధికారికంగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టనుండగా.. ఇందిరమ్మ ఇళ్ల, సీజనల్ వ్యాధులు, ఎరువుల సరఫరా, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలోనే తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు పాల్గొనాల్సి ఉంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒకచోట ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పాల్గొనేలా కలెక్టర్‌లు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసి సమాచారం అందించారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్డీఓ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించారు. రేషన్ కార్డుల పంపిణీ మొదటి ప్రాధాన్యం కాగా, ఉమ్మడి వరంగల్‌లో ఎంతమందికి అవకాశం దక్కుతుందన్న చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 12.13 లక్షల రేషన్‌కార్డులుండగా.. జనవరిలో నిర్వహించిన ప్రజాపాలన సదస్సుల్లో 1,57,820 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 7.31 లక్షల మందికి కార్డులు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించగా... ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన దరఖాస్తులపై కసరత్తు చేసిన అధికారులు ఎందరిని అర్హులుగా తేల్చారో? అన్న సందేహాలకు నేటినుంచి తెరపడనుంది. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి తొమ్మిది లక్షల మేరకు దరఖాస్తులు రాగా, వాటిని వడబోసిన అధికారులు.. ఆరున్నర లక్షల వరకు కుదించినట్లు ప్రకటించారు. మొదటి విడతగా నియోజవర్గానికి 3,500ల చొప్పున 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 42 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 50శాతం మంది ఇప్పటికీ ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టలేదన్న ప్రచారం ఉంది. ఈ మేరకు ఈ నిర్మాణాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నట్లు అధికారుల సమాచారం.

సదస్సులపై ఇంటెలిజెన్స్ నిఘా..?

రేషన్‌కార్డుల పంపిణీ, మండలస్థాయి సదస్సుల తీరుపై నివేదికలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఇంటెలిజెన్స్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. జూలై 25 నుంచి ఆగస్టు 10 ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరుగుతున్న కార్యక్రమాలపై సమగ్ర నివేదిక రోజు వారీగా అందించాలని సూచించినట్లు తెలిసింది. మొదటి రోజు ఏయే నియోజకవర్గాల్లో ఏ మండలాల్లో నిర్వహించారు? ఆ కార్యక్రమాల్లో ఎవరెవరు పాల్గొన్నారు? ఇన్‌చార్జ్ మంత్రి ఎక్కడెక్కడ పాల్గొన్నారు? ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరవుతున్నారా? చాలా ఏళ్ల తర్వాత రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న సందర్భంగా అర్హులైన వారి స్పందన ఎలా ఉంది? తదితర అంశాలపై నివేదిక కోరినట్లు సమాచారం.

సర్కారు బడుల్లో ఏఆర్, వీఆర్ ల్యాబ్స్

ఉమ్మడి జిల్లాలో 10 పాఠశాలలు ఎంపిక
- ప్రతీ సబ్జెక్టుతో అనుసంధానం
- విద్యార్థులకు ప్రత్యక్ష అనుభూతి



ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లకు సంబంధించి మోడల్ చిత్రాలు

జనగామ : ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో ఎంపికైన పాఠశాలల్లో సాంకేతిక విద్య అమలు చేస్తూ ఆధునిక పరిశోధన కేంద్రాలుగా మారుస్తోంది. ఇంటర్నెట్‌తో కూడిన కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతులు, కనీస వసతి సౌకర్యాల కోసం నిధులు మంజూరు చేస్తున్న కేంద్రం.. కొత్తగా ఏఆర్(అగ్మెంటెడ్ రియాల్టీ), వీఆర్(వర్చువల్ రియాల్టీ) ల్యాబోరేటరీలను అందుబాటులోకి తీసుకువచ్చింది. పైలెట్ ప్రాజెక్టులో మొదటి విడత ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 10 పీఎం శ్రీ పాఠశాలలను ఎంపిక చేశారు.

బోధన.. ప్రయోజనాలిలా..

- ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లతో ఆస్ట్రోనమీ (ఖగోళ శాస్త్రం), రెండవ ప్రపంచ యుద్ధం, గుండె పనితీరు, మానవ శరీరంలోని అవయవాల కదలికలు, నాటి చరిత్రలు (హిస్టరీ) తదితర సబ్జెక్టుల వారీగా బోధన చేసే సమయంలో విద్యార్థులు ప్రత్యక్ష అనుభూతికి లోనవుతారు.
- దిగువ స్థాయి పిల్లవాడినుంచి బాగా చదువుకునే విద్యార్థి వరకు ఏఆర్, వీఆర్ బోధన పరికరాలతో టీచర్ చెప్పే విషయాలను శ్రద్ధగా వింటారు.
- విద్యార్థులు గుండె, కణాల నిర్మాణం వాటి విధులు, జీవశాస్త్ర, ఆస్ట్రానమీ లాంటి ఫిజిక్స్, గణిత, గతంలోకి వెళ్లి హిస్టరీ పాఠాలను ఇమ్మర్సివ్, ఇంటరాక్టివ్ టెక్నాలజీలను ఉపయోగించి వీఆర్ ద్వారా వాటిలోకి ప్రవేశించి స్వీయ అనుభవంతో నేర్చుకుంటారు.
- పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రతీ పాఠశాలకు 10 ఏఆర్, వీఆర్ పరికరాలు,ఒక బీన్ బ్యాగ్,ఒక చార్జింగ్ ట్రాలీ, ఒక టాబ్,ఒక టీచర్ సపోర్టింగ్ ట్యా బ్,ఒక స్టోరేజ్ కేస్,1కేవీఏ యూపీఎస్ పరికరాలను ల్యాబ్‌లో అమర్చనున్నారు.
- 5 నుంచి 10 తరగతి వరకు జనరల్ సైన్స్, గణితం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రాన్ని బోధించడానికి, విద్యార్థులు నేర్చుకోవడానికి అనుకూలంగా ఏర్పా టు చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లా	మండలం	ఉన్నత పాఠశాల
హనుమకొండ	ఐనవోలు	ఒంటిమామిడిపల్లి
హనుమకొండ	కాజీపేట	మడికొండ
భూపాలపల్లి	భూపాలపల్లి	గొల్ల బుద్దారం
జనగామ	అర్బన్	ధర్మకంచ
మహబూబాబాద్	మహబూబాబాద్	బాలికల
మహబూబాబాద్	తొర్రూరు	తొర్రూరు
మహబూబాబాద్	గూడూరు	పానుగోడు
మహబూబాబాద్	దంతాలపల్లి	దంతాలపల్లి
వరంగల్	నర్సంపేట	నర్సంపేట, బాలికల
వరంగల్	రాయపర్తి	కొండూరు

5డీ మోడ్‌లో....

వీఆర్ హెడ్‌గేర్ రాష్ట్ర పాఠ్యాంశాలకు మ్యాప్ చేసిన కంటెంట్‌తో లోడ్ చేశా రు. దీని ద్వారా విద్యార్థులు ఇంటరా క్టివ్ , 5డీ(ప్రస్తుత టెక్నాలజీ) మోడ్‌లో పాఠాలను నేర్చుకోగలుగుతారు. గుండె పనితీరును బోధించే సమయంలో ఉపాధ్యాయులు బోర్డుపై హృదయ రే ఖాచిత్రాన్ని గీసి చూపించాలి. వీఆర్ ఆధారిత అ భ్యాసం విషయంలో హెడ్‌గేర్‌ను ఉపయోగించడంతో త్రీడీలో హృదయం తెరపై కనిపిస్తుంది. మనిషి ఆర్గాన్ పనితీరును విద్యార్థులు చూడడంతోపాటు సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది.

పీఎం శ్రీ ఎంపిక చేసిన పాఠశాలల్లోనే..



ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలల పరిధిలో ఎంపిక చేసిన స్కూల్స్‌లో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. పరికరాలు సైతం వస్తున్నాయి. ఇందుకు సంబంధించి పూర్తి గైడ్‌లైన్స్ జారీ చేశారు. మెటీరియల్ వినియోగం, నిర్వహణ కోసం పాఠశాలలోని ఫిజికల్ లేదా బయాలజీ టీచర్‌ను నియమిస్తారు. ఏజెన్సీ ద్వారా ఏఆర్, వీఆర్ ల్యాబ్‌ల పరికరాలు వచ్చిన వెంటనే హెచ్‌ఎంలు జాగ్రత్తగా పరిశీలించుకోవాలి.

– బొమ్మన బోయిన శ్రీనివాస్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, జనగామ

క్లుప్తంగా

నేటినుంచి పలు రైళ్లు రద్దు

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పెద్దపల్లి రైల్వే బైపాస్, బల్హార్షా–కాజీపేట సెక్షన్‌లో చేపడుతున్న రైల్వే నాన్ ఇంటర్‌లాకింగ్ బ్లాక్‌తో శుక్రవారం నుంచి కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు.

రద్దయిన రైళ్లు..

ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు కాజీపేట–సిర్పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, బల్హార్షా–కాజీపేట (17004) సింగరేణి ప్యాసింజర్, బల్హార్షా–కాజీపేట (17036) ప్యాసింజర్, సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (12757) ఇంటర్‌సిటీ, సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (12758) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు తెలిపారు.

పలు రైళ్లు కాజీపేట వరకే..

ఈ నెల 25 నుంచి 27వ తేదీవరకు హైదరాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్‌కాగజ్‌నగర్–బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్, భద్రాచలంరోడ్–బల్హార్షా (17033) సింగరేణి, సిర్పూర్‌టౌన్–భద్రాచలంరోడ్ (17034), సిర్పూర్‌కాగజ్‌నర్ –సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్‌లను కాజీపేట నుంచి, కాజీపేట వరకు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా బాక్సింగ్ ఎంపికలు



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న బాక్సింగ్ సంఘం బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 20 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో జహీదా, వైష్ణవి, ఎం.డి. అఫ్రీన్, కె. సాయిప్రణీత, బాలుర విభాగంలో ఎస్. హర్షవర్ధన్, జి. మణిప్రసాద్, బి. భార్గవ్, జి. సుమిత్, పి. రామ్‌చరణ్, ఎస్. ఆర్య , పి. హర్షిత్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు నిర్వహణ కార్యదర్శి పి. రాజేందర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నేటి (శుక్రవారం) నుంచి ఈ నెల 27వ తేదీ వరకు హైదరాబాద్ షేక్‌పేట్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మేడిగడ్డకు పెరిగిన వరద



మేడిగడ్డ బ్యారేజీ వద్ద వరద

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీకి వరద ప్రవాహం పెరుగుతోంది. మూడు రోజులుగా తెలంగాణ, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి గోదావరి, ప్రాణహిత నదులకు వరద తాకిడి పెరిగింది. దీంతో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 7.400 మీటర్ల ఎత్తులో నీటిమట్టం ప్రవహిస్తోంది. ఫలితంగా వరద నీరు దిగువన మేడిగడ్డకు చేరుతోంది. అక్కడ బ్యారేజీకి 2.90లక్షల క్యూసెక్కులు వరద తరలి రావడంతో మొత్తం 85 గేట్లు ఎత్తి అదే స్థాయిలో దిగువకు తరలిస్తున్నారు. వరద మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు.

వారసత్వ హోదాకు నాలుగేళ్లు..

యునెస్కో గుర్తింపు పొందినా కానరాని అభివృద్ధి

- పునాదుల్లోనే కామేశ్వరాలయ పనులు
- వినియోగంలోకి రాని ఉప ఆలయాలు
- రామప్ప తూర్పు రోడ్డుకు గ్రహణం
- నిద్రమత్తులో పురావస్తుశాఖ అధికారులు



నీటితో నిండిన కామేశ్వరాలయం పునాది



సరస్సు కట్ట మీద వినియోగంలోకి రాని ఉప ఆలయాలు

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించడంతో దేశంతోపాటు తెలుగు రాష్ట్రాల ప్రజలు గర్వపడ్డారు. ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం పాలంపేట పరిధిలో 1213లో కాకతీయులు నిర్మించిన రామప్ప దేవాలయానికి యునెస్కో హోదా కల్పిస్తున్నట్లు జూలై 25, 2021న వరల్డ్ హెరిటేజ్ కమిటీ ప్రకటించడంతో ప్రజలు, పర్యాటకులు ఆనందం వ్యక్తం చేశారు. రామప్ప ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని సంబురపడ్డారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు సైతం ఆలయాన్ని సందర్శించి రూపురేఖలు మారుస్తామని, రామప్ప అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ నీటిమూటగానే మిగిలింది. రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చి నేటికి(శుక్రవారం) నాలుగేళ్లు పూర్తయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది పరిస్థితి. రామప్పకు గుర్తింపునిచ్చే నేపథ్యంలో వరల్డ్ హెరిటేజ్ కమిటీ కొన్ని షరతులు విధించింది. ఆలయానికి వచ్చే పర్యాటకులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఆలయం చుట్టూ 500 మీటర్ల లోపు బఫర్ జోన్ ప్రకటించి ఎలాంటి నిర్మాణాలు, కట్టడాలు చేపట్టొద్దని షరతులు విధించింది. 2022 డిసెంబర్‌లోగా ఆలయ ఆవరణలోని కామేశ్వరాలయాన్ని పునర్నిర్మించాలని, రామప్ప పరిసర ప్రాంతాల్లోని 10 ఉప ఆలయాలకు మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని షరతుల్లో ప్రధానంగా పేర్కొంది. అయితే నాలుగేళ్లు గడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు రామప్ప ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంపై పర్యాటకులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

80 శాతం పూర్తయిన ప్రశాద్ ప్రాజెక్టు పనులు

రామప్పకు యునెస్కో గుర్తింపు రావడంతో దేవాలయానికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకులకు వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రశాద్' ప్రాజెక్టు కింద రూ.61.99 కోట్లు కేటాయించింది. మొదటి విడతగా రూ.42.14 కోట్లు మంజూరు చేసి సుమారు 10 ఎకరాల్లో ఇంటర్ ప్రిటేషన్ సెంటర్ నిర్మిస్తోంది. ఇందులో పర్యాటకుల సమాచార కేంద్రం, విశ్రాంతి గది, సమావేశపు గది, జ్ఞానకేంద్రం, ఆధ్యాత్మిక కేంద్రం, సాంస్కృతిక కేంద్రం, చిత్రకళామందిర్ (4డీ మూవీహాల్), టాయిలెట్ బ్లాక్, మెడికల్ రూం, ఫుడ్ కోర్టు, స్టాల్స్, ఫౌంటెన్, చిల్డ్రన్స్ పార్క్ నిర్మించడంతో పాటు విహారం ప్రదేశంగా ఇంటర్ ప్రిటేషన్ సెంటర్‌ను తీర్చిదిద్దుతున్నారు. పనులు 80 శాతం పూర్తయ్యాయని, మూడు నెలల్లో మిగతావి పూర్తి చేసి డిసెంబర్‌లో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామని టూరిజం అధికారులు తెలిపారు.

ముందుకు సాగని కామేశ్వరాలయ పనులు..

రామప్ప ఆలయ ఆవరణలోని కామేశ్వరాలయాన్ని పునర్నిర్మాణం పేరుతో 2011లో పురావస్తుశాఖ అధికారులు తొలగించారు. తొలగించిన శిల్పాలను రామప్ప గార్డెన్‌లో ఉంచడంతో శిల్పాలు ఎండుతూ, తడుస్తూ కళాసౌందర్యాన్ని కోల్పోతున్నాయి. 2022 డిసెంబర్‌లోగా కామేశ్వరాలయాన్ని పునరుద్ధరించాలని హెరిటేజ్ కమిటీ షరతు విధించినా ఇప్పటివరకు ఆలయ నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. 2026 జూన్‌లోగా పూర్తి చేస్తామని కేంద్ర పురావస్తుశాఖ అధికారులు గడువు తీసుకుని 2025 మార్చిలో పనులు ప్రారంభించారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కామేశ్వరాలయ నిర్మాణ ప్రదేశం నీటితో నిండి కుంటను తలపిస్తోంది.

రూ.15 కోట్లు కేటాయించినా అభివృద్ధి ఏది?

రామప్ప ఆలయం ఎదుట ఉన్న గొల్లాలగుడి, శివాలయాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని హెరిటేజ్ కమిటీ పేర్కొంది. గొల్లాలగుడికి మరమ్మతు చేపట్టి అభివృద్ధి చేసినా పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురాలేదు. గతేడాది గుప్తనిధుల కోసం గొల్లాలగుడి పైకప్పును దుండగులు ధ్వంసం చేశారు. ఆలయం ఎదుట ఉన్న మరో శివాలయాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే కూలుతుందనే కారణంతో ఆరునెలల క్రితం ఆలయానికి సపోర్టుగా ఇనుప పైపులు అమర్చి వదిలేశారు. రామప్ప పరిధిలోని 10 ఉప ఆలయాలను కూడా వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. కేవలం ఆలయాలపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఉప ఆలయాలకు రూ.15 కోట్లు కేటాయించినా అభివృద్ధి ముందుకు సాగలేదు.



అధ్వానంగా ఉన్న రామప్ప తూర్పు రోడ్డు

తూర్పు రోడ్డుకు కలగని మోక్షం..

రామప్ప ఆలయాన్ని వాస్తుపరంగా దర్శించుకునేందుకు తూర్పుముఖ ద్వారాన్ని (రోడ్డు) 2020లో రూ.90 లక్షల వ్యయంతో నిర్మించారు. రెండు వరుసల రోడ్డును నిర్మించి, సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేశారు. పూర్తయిన మూడు నెలలకే రామప్ప సరస్సు మత్తడి నుంచి వచ్చే వరదనీటికి కొట్టుకుపోయింది. వరద నీరు వెళ్లేందుకు వేసిన పైపులు సైతం ధ్వంసమయ్యాయి. మూడు నెలల క్రితం రోడ్డుకు మరమ్మతులు చేపట్టినా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో పర్యాటకులు పడమర రోడ్డు మీదుగా వెళ్లి రామప్ప ఆలయాన్ని సందర్శిస్తున్నారు.

భీమునిపాదం సందర్శన నిలిపివేత

- జలపాతం గేట్ మూసిన పోలీసులు



జలపాతం గేట్ మూసి హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు చేసిన పోలీసులు

గూడూరు : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అడవిలోని భీమునిపాద జలపాతం సందర్శనను పోలీసులు తాత్కాలికంగా నిలిపివేశారు. పర్యాటకులు జలపాతం వద్దకు రాకుండా గురువారం గేట్ మూసివేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలపాతం ఉధృతంగా జాలువారుతోంది. ఈ క్రమంలో పర్యాటకులు ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతంలోకి దిగి ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ముందస్తు చర్యలు భాగంగా ఎస్సై గిరిధర్‌రెడ్డి గేట్‌ను మూసివేశారు. దీంతో పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు. ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు లేకపోయినా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తమను జలపాతం చూడకుండా గేట్ మూసివేయడం సరికాదని అసహనం వ్యక్తం చేశారు. కాగా, జాలువారుతున్న భీమునిపాదం జలపాతం దృశ్యాలు గురువారం పలు ప్రతికల్లో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జలపాతానికి పర్యాటకుల తాకిడి ఉంటుందనే కారణంతో సందర్శనను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

నకిలీ వైద్యుడిపై కేసు

ఎంజీఎం: ఎంబీబీఎస్ విద్యార్హత పత్రాలు లేకుండా హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ సమీపంలో హెల్పింగ్ హ్యాండ్ డ్రగ్ ఎడిక్షన్, సైకియాట్రిక్ కేంద్రాన్ని నిర్వహిస్తున్న రాముపై సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు వ్యక్తి కేంద్రానికి వచ్చే రోగులకు తనకు తానే తాను డాక్టర్‌గా పేర్కొంటూ చట్టవిరుద్ధంగా అల్లోపతి మందులు, ఇంజక్షన్లు ఇస్తున్నాడు. రెండు అంతస్తుల భవనంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాడుతున్నారని టీజీఎంసీ రిజిస్ట్రార్ దండం లాలయ్యకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సెక్షన్‌కు ఏఈనే బాస్..



మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: కంపెనీకి సీఎండీ బాస్ మాదిరిగానే సెక్షన్‌కు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) బాస్ అని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి హనుమకొండ విద్యుత్ నగర్‌లోని తెలంగాణ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎండీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సెక్షన్ ఏఈ బాధ్యత అత్యంత కీలకమన్నారు. కంపెనీ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా వినియోగదారులకు మెరుగైన సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత అసిస్టెంట్ ఇంజనీర్లపై ఉందన్నారు. ప్రతీ ఉద్యోగి విద్యుత్ ప్రమాదాలు లేని కంపెనీ లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రెడ్డి మాట్లాడుతూ డిప్లొమా ఇంజనీర్స్ హక్కులు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా (సర్కిల్) కమిటీలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా శ్రీకర్, రాములు వ్యవహరించారు. హనుమకొండ సర్కిల్ ప్రెసిడెంట్‌గా రాజు, కార్యదర్శిగా వంశీ కృష్ణ, వరంగల్ సర్కిల్ ప్రెసిడెంట్‌గా చంద్రమౌళి, సెక్రటరీగా సాయి కృష్ణ, జనగామ సర్కిల్ అధ్యక్షుడిగా కనకయ్య, సెక్రటరీగా లక్ష్మీనారాయణ, మహబూబాబాద్ సర్కిల్ ప్రెసిడెంట్‌గా చలపతి రావు, సెక్రటరీగా సతీశ్, భూపాలపల్లి సర్కిల్ ప్రెసిడెంట్‌గా దేవేందర్, సెక్రటరీగా రాజ్ కుమార్, ములుగు సర్కిల్ ప్రెసిడెంట్‌గా రణధీర్, సెక్రటరీగా వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, సి.ప్రభాకర్, తెలంగాణ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ సెక్రటరీ నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్ రావు, అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూలు కలెక్టర్‌కు మాతృవియోగం



కలెక్టర్ సంతోష్‌కుమార్‌ను పరామర్శిస్తున్న జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జఫర్‌గఢ్: జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం సూరారం గ్రామానికి చెందిన నాగర్ కర్నూలు కలెక్టర్ బాదావత్ సంతోష్‌కుమార్ తల్లి శాంతమ్మ (50) మృతి చెందింది. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శాంతమ్మ.. గురువారం కన్నుమూసింది. విషయం తెలుసుకున్న జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గ్రామానికి చేరుకుని శాంతమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగర్‌కర్నూలు కలెక్టర్ సంతోష్ కుమార్‌ను పరామర్శించారు. కలెక్టర్ సంతోష్‌కుమార్‌ను పరామర్శించిన వారిలో జనగామ కలెక్టర్‌తో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, కొల్లాపూర్ ఆర్డీఓలు వెంకన్న, బన్సీలాల్, వివిధ జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ బిగించడం లేదని..

- గిరిజన రైతు ఆత్మహత్యాయత్నం
- మైలారం విద్యుత్‌సబ్ స్టేషన్‌లో ఘటన



ఆత్మహత్యకు యత్నిస్తున్న రైతు రమేశ్

రాయపర్తి: విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ బిగించడంలేదంటూ ఆరోపిస్తూ ఓ గిరిజన రైతు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన గురువారం మండలంలోని మైలారం విద్యుత్‌సబ్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఊకల్ శివారు బీల్‌నాయక్‌తండాకు చెందిన రైతు రమేశ్ సుమారు 15 రోజుల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీ చెల్లించాడు. అయితే సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ బిగించకపోవడంతో వరి పంట ఎండుతోంది. దీనిపై మనస్తాపం చెందిన రమేశ్ ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరలైంది. దీనిపై అధికారులు వెంటనే స్పందించి గంటల వ్యవధిలోనే ట్రాన్స్‌ఫార్మర్ బిగించి సమస్యను పరిష్కరించారు. కాగా, ఈనెల 19న బీల్‌నాయక్ తండాకు చెందిన ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని అధికారులకు సమాచారం వచ్చిందని, టెక్నికల్ ఇబ్బందులు, సెలవు రావడంతో ఆలస్యమైందని వర్ధన్నపేట ఏడీఈ నటరాజ్ తెలిపారు.

విద్యా కమిషన్‌కు సమస్యల ఏకరువు..

విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకుల గోడు

- కేయూ సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తాం
- రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



సమావేశంలో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు, వీసీ, రిజిస్ట్రార్



హాజరైన విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, తదితరులు

కేయూ క్యాంపస్: రాష్ట్ర విద్యాకమిషన్‌కు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకులు సమస్యలు ఏకరువు పెట్టారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గురువారం రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర్‌రావు, చారకొండ వెంకటేశ్ బృందం.. కాకతీయ యూనివర్సిటీకి విచ్చేసింది. ఈ సందర్భంగా వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రంతో కలిసి క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించింది. ఇందులో యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను వారు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. సావధానంగా విన్న రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి.. కేయూలోని సమస్యలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కాగా, ఈ సమావేశం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.20 గంటల వరకు కొనసాగింది.

బ్లాక్ గ్రాంట్ పెంచాలి..
ఎన్‌జీఓ బాధ్యుల వినతి

కాకతీయ యూనివర్సిటీలోని ఉద్యోగులు, పెన్షనర్ల జీతభత్యాలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ పెంచాలని ఎన్‌జీఓ బాధ్యులు విద్యా కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ట్రెనింగ్ సెంటర్ నెలకొల్పాలని కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడు వల్లాల తిరుపతి , నవీన్, సతీశ్, ఇతర బాధ్యులు వినతిపత్రం అందించారు. 2013లో నియమితులైన తమకు పీఆర్‌సీని వర్తింపజేయాలని క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ బాధ్యుడు బొక్క మొగిలి వినతిపత్రం సమర్పించారు. తమను రెగ్యులరైజ్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రాలు సమర్పించారు.

ప్రధానంగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ప్రస్తావించిన సమస్యలు..

- కేయూలో ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్‌గా మార్చాలి
- క్యాంపస్, యూనివర్సిటీ కాలేజీల్లో సీటు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి.
- కేయూలోని మహిళా ఇంజనీరింగ్ కాలేజీకి సొంత భవనం నిర్మించాలి. రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి.
- కేయూలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్లాలంటే సరైన దారి లేదు. విద్యార్థులు మూడు కిలోమీటర్ల వరకు నడవాల్సింటుంది.వాహన సదుపాయం కల్పించాలి. విద్యార్థినులకు అక్కడే కళాశాల సమీపంలో హాస్టల్‌వసతి కల్పించాలి.
- కేయూ లా కళాశాలకు మూట్ కోర్టు కూడా లేదు. వెంటనే ఏర్పాటు చేయాలి. లా కాలేజీ ఐదేళ్ల కోర్సు విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి.
- కేయూలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీకి ఫిజికల్ డైరెక్టర్‌ను నియమించాలి. ప్రతీ యూనివర్సిటీ కాలేజీ కూడా పీడీని నియమించాలి.
- కేయూ భూములను రక్షించాలి. యూనివర్సిటీ చుట్టూ ప్రహరీని నిర్మించాలి.
- కేయూ అభివృద్ధికి నిధులు పెంచాలి

రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి

కేయూలో రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి. మొత్తం 408 అధ్యాపక పోస్టులుంటే 77 మంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ అధ్యాపకులను నియమించని పక్షంలో ఇప్పటికే పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి.

– బి. వెంకట్రామ్‌రెడ్డి, 'అకుట్' అధ్యక్షుడు

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

గత ప్రభుత్వం పదేళ్లలో యూనివర్సిటీలను నిర్వీర్యం చేసింది. జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లను రెగ్యులరైజ్‌చేసింది. యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను మాత్రం చేయలేదు. దీనిపై పలుమార్లు మంత్రులు, ముఖ్యమంత్రిని కూడా కలిశాం. అయినా మా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి.

–కరుణాకర్, సాధు రాజేశ్, ఫిరోజ్, శ్రీధర్‌కుమార్‌లోథ్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు

కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలి

కేయూలో పార్ట్‌టైం అధ్యాపకులుగా 11 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాం. అయినా కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయడం లేదు. మాతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్నా మాకు వచ్చే వేతనం అంతంత మాత్రమే. ఇప్పటికైనా పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టుగా కన్వర్షన్ చేయాలి.

–తిరునహరిశేషు, కుప్లా బాధ్యుడు

పదేళ్లలో విద్యారంగం విధ్వంసం

గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం విధ్వంసమైంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పాటయ్యాక విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ఇందులోభాగంగా పలుమార్లు విద్యారంగంపై సమీక్షలు చేశారు. యూనివర్సిటీల్లోని సమస్యలపై కూడా అధ్యయనం చేసేందుకు విద్యా కమిషన్ ఏర్పాటు చేయగా కేయూకు వచ్చింది. ఇక్కడి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి విద్యా కమిషన్ కృషి చేస్తుంది.

–వెంకటేశ్, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు

పిల్లల భవిష్యత్ మార్చేది ఉపాధ్యాయులే..

- విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

ఖమ్మం సహకారనగర్: పిల్లల భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం ఆమె ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల అధికారులతో విద్యాశాఖపై సమీక్షించారు. డీఈఓలు, ఎంఈఓలు తరచూ పాఠశాలలను తనిఖీ చేస్తూ ఉపాధ్యాయులకు సూచనలు చేయాలన్నారు. ఐఏ ల్యాబ్‌ల నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరును ఫేస్ రికగ్నేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ద్వారా నమోదు చేయాలని సూచించారు. ఎస్సెస్సీలో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన, మూతబడిన స్కూళ్లు తెరిపించిన, అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన మండలాల ఎంఈఓలను సన్మానించారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష

మహబూబాబాద్ రూరల్ : భూ వివాదంలో ఒకరిని హత్య చేసిన ఘటనలో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ గురువారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి, హెడ్ కానిస్టేబుల్ తేజావత్ దేవనాయక్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లికి చెందిన మహ్మద్ బాషుమియా పేరుమీద సర్వే నంబర్ 140/7లో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమి విషయంలో మహ్మద్ బాషుమియా, అతడి సమీప బంధువుల మధ్య భూతగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అక్టోబర్ 14, 2015న బాషుమియా సదరు వ్యవసాయ భూమిని ట్రాక్టర్‌తో దున్నిస్తున్నాడు. అదే సమయంలో బాషుమియాకు తమ్ముడి వరసైన సైదులు, అతడి బావ యాకూబ్, సైదులు అల్లుడు రఫీ అక్కడకు వచ్చి బాషుమియాతో ఘర్షణకు దిగారు. అనంతరం ఆ ముగ్గురు కొడవలి, కత్తులతో బాషుమియాను నరికి చంపారు. ఈ ఘటనపై మృతుడి తమ్ముడు మహమ్మద్ పాషా ఫిర్యాదు మేరకు అప్పటి కేసముద్రం ఏఎస్సై రాంజీనాయక్ కేసు నమోదు చేయగా అప్పటి మహబూబాబాద్ రూరల్ సీఐ కృష్ణారెడ్డి విచారణ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన అప్పటి జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు, ప్రస్తుత జిల్లా కోర్టు ఇన్‌చార్జ్ పీపీలు గణేశ్ ఆనంద్, మురళీ కోర్టులో వాదనలు వినిపించగా డీఎస్పీ తిరుపతిరావు, మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో సీడీఓ దేవనాయక్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ.. నేరం నిరూపణ కాబడిన సైదులు, యాకూబ్, రఫీకి యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.